# శేషకవిత

(గత సంచిక తరువాయి)

మోహనకృష్ణ తండ్రి రఘునందనరావు ఆ వూళ్ళోకెల్లా పెద్ద లీడింగ్ లాయరు. గొప్ప వ్యవహారజ్ఞుడు. ఎలాంటి సమస్యనైనా సూదిలోంచి దారం తీసినట్టు పరిష్కరించగలడు. ఊళ్ళో కచ్చిదార్లకు కల్పతరువు. ఇంట్లో చండశాసనుడు.

పద్మావతమ్మ రెండు రోజులపాటు కొడుకు విషయం మనసులోనే కొన్ని లక్షలసార్లు తర్కించుకుని చివరికి భర్తతో చెప్పాలనే తీర్మానించుకుంది. ఆయన మంచి మూడ్‌లో వున్న సమయం కోసం అదే పనిగా కాచుకుని భయపడుతూనే మోహనకృష్ణ తెచ్చిపెట్టిన సమస్య గురించి చెప్పేసింది.

అయితే రఘునందనరావు ఆవిడ భయపడ్డట్టు ఆ సంగతి వింటూనే ఆగ్రహోదగ్రుడైపోలేదు. కొడుకుని పిలిచి తిట్టి రభస చేయలేదు. భార్య చెప్పిన మాట సాంతం శాంతంగా విన్నాడు. ఆవిడ చెప్పాల్సింది పూర్తిచేశాక సాలోచనగా ఆయన భృకుటి ముడివడింది. "ఊ! వీడింకా పసివాడే అనుకుంటున్నారు. పెళ్ళి గురించి ఆలోచించేంత వాడయ్యాడన్న మాట!" అన్నాడు.

"ఇప్పుడు మనమేం చేద్దామంటారు?" ధైర్యం కూడదీసుకుంటూ అడిగింది పద్మావతమ్మ.

రఘునందనరావు కొద్ది క్షణాలేం మాట్లాడలేదు. "ఆలోచిద్దాంలే", అని మాత్రం అని వూరుకున్నాడు.

పద్మావతమ్మ మనసు ఆ మాటతో శాంతించలేకపోయింది. భర్త గురించి ఆమెకు బాగా తెలుసు. ఆయన ఆ మాటన్నాడంటే ఏదో కఠోరమైన నిర్ణయం తీసుకోబోతున్నాడన్న మాటే. ఇన్నేళ్ళుగా ఒడిదుడుకుల్లేకుండా సాగిపోయిన తన గృహజీవితంలో ఈ కొత్త సమస్య ఎలాంటి పరిణామాలు తెచ్చిపెట్టబోతోందో వూహించలేక ఆ తల్లి హృదయం కంపించిపోయింది.

"పోనీ, అబ్బాయి చెప్పినట్టుగానే వింటే? కల్యాణి లక్షణమైన పిల్ల," అంది బెరుగ్గా.

"ఆలోచిస్తానన్నానా," అంటూ కసిరి మంచం మీద అవతలికి తిరిగి పడుకున్నాడు రఘునందనరావు.

పద్మావతమ్మకు ఆ రాత్రి నిద్ర కరువైపోయింది.

ఆ మర్నాడు దుస్తులు వేసుకుని కాలేజీకి బయల్దేరబోతున్న మోహనకృష్ణని తన ఆఫీసు గదిలోకి పిలిచాడు రఘునందనరావు. "ఏరా, ఆ పనిమనిషి కూతుర్ని - ఏవిటా పిల్ల పేరు? ఆ, అదే, కల్యాణి- ఆ పిల్లని పెళ్ళి చేసుకుంటానన్నావుట?"

మోహనకృష్ణ సమాధానం చెప్పకుండా తల వంచుకున్నాడు.

"జవాబు చెప్పవేరా? ప్రేమించడం తెలును గానీ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పడం తెలీదా?"

మోహనకృష్ణ తల పైకెత్తాడు. "అవును నాన్నా. కల్యాణి అంటే నాకు చాలా ఇష్టం."

"ఊ! అయితే నాముందే తల పైకెత్తి మాట్లాడేంత వరకూ వచ్చిందన్నమాట వ్యవహారం! సరే, ఇక నువ్వెళ్ళొచ్చు."

మోహనకృష్ణ బరువైన మనసుతో వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం కోర్టు నుంచి త్వరగా ఇంటికి వచ్చిన రఘునందనరావు పద్మావతమ్మని పిలిచాడు. "ఏడీ వీడు? ఇంకా రాలేదా?"

"లేదు."

"సరే! వాడి విషయంలో నేనొక నిర్ణయానికి వచ్చాను."

పద్మావతమ్మ గుండె వేగంగా కొట్టుకోనారంభించింది.

"వాడికి ఆ పిల్లనే ఇచ్చి పెళ్ళి చేస్తామని చెప్పు," అన్నాడు రఘునందనరావు.

పద్మావతమ్మ తన చెవుల్ని తానే నమ్మలేకపోయింది. "నిజంగానా?!" మహాశ్చర్యంతో అడిగింది.

"ఒకసారి చెప్తే అర్థం కాలేదా?" ఖస్సుమన్నాడు రఘునందనరావు.

మోహనకృష్ణ కాలేజీ నుంచి చాలా ఆలస్యంగా ఇంటికి తిరిగొచ్చాడు. కొద్ది రోజులుగా అతనలాగే చేస్తున్నాడు. కల్యాణికి ఈ విషయలేమీ తెలీవు. ఆమె మామూలుగానే ఆ ఇంటికి వచ్చి వెళ్తోంది. తన తల్లికి ఆరోగ్యం సరిగా లేదని తనే పద్మావతమ్మకు ఇంటి పనుల్లో సాయపడుతోంది. పద్మావతమ్మ కూడా ఆమె ముందు ఈ విషయలేవీ బయట పెట్టకుండా గుంభనగా నెట్టుకొస్తోంది.

ఆ సాయంత్రం కల్యాణి ఇంటికి తిరిగి వెళ్ళిపోయాక పద్మావతమ్మ మోహనకృష్ణని తన గదిలోకి పిలిచింది. "మీ నాన్నగారు నీ మాట సరేనన్నారు"

# లవ్ లీ స్టోరీస్

# దాదా హయాత్

మోహనకృష్ణకి ఒక్క క్షణం తాను వింటున్నది తనకే నమ్మశక్యం కాలేదు. "నిజంగానా?!" అన్నాడు.

పద్మావతమ్మ అవునన్నట్టు తలూపింది.

మోహనకృష్ణకి అనుకోకుండా కళ్ళ వెంట నీళ్ళొచ్చాయి. "నువ్వెంత మంచి దానివమ్మా!" అన్నాడామె చెయ్యందుకుని కళ్ళకద్దుకుంటూ.

తల్లి అతనివంక ఉదాసీనంగా చూసింది. "మీ నాన్నగారికి కోపం తెప్పించడం మంచి పని కాదు మోహనా! ఇక ముందైనా ఆయనకు విధేయంగా మసలుకో," అంది.

"మసలు కుంటానమ్మా! తప్పకుండా మసలుకుంటాను. నాన్నగారు నాకిచ్చిన వరం ఎంత గొప్పదో నీకు తెలీదు. ఎప్పుడూ ఆయన మాట జవదాటను. జీవితంలో మరెప్పుడూ ఆయనకు కోపం తెప్పించను," అన్నాడతను.

ఆ మర్నాడు కల్యాణి ఇంటికొచ్చే వేళకు మోహనకృష్ణ మళ్ళీ యథాప్రకారం గుమ్మం దగ్గర ఆమెకు ఎదురయ్యాడు. "ఏవండోయ్, నా శేషకవిత?"

కల్యాణి అతనివైపు విచిత్రంగా చూసి ఉదాసీనంగా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

మోహనకృష్ణ లోలోపలే ఆనందంగా నవ్వుకున్నాడు.

అతని మనసిప్పుడు గాలికంటే తేలిగ్గా వుంది.

రెండురోజుల తర్వాత రఘునందనరావు కొడుకుని ఆఫీసు గదిలోకి పిలిచాడు. తండ్రి పిలుస్తూనే చాలా హుషారుగా వెళ్ళాడు మోహనకృష్ణ. అతనిప్పుడు తండ్రి ఆజ్ఞాపిస్తే సముద్రంలో దూకడానికైనా సిద్ధంగా వున్నాడు. అతను వెళ్ళేసరికి రఘునందనరావు మొహం గంభీరంగా వుంది.

"మోహనా! హైదరాబాదులో మీ బాబాయికి మళ్ళీ తీవ్రంగా గుండెనొప్పి వచ్చిందట. నీ కోసం చాలా కలవరిస్తున్నాడని వుత్తరం రాసింది మీ పిన్నమ్మ."

ఆ మాట వింటూనే మోహనకృష్ణ మొహంలో విషాదచ్ఛాయలు అలుము కున్నాయి. బాబాయికి తానంటే ఎంతో ప్రేమ. నాలుగురోజులు అవకాశం వస్తే చాలు,



ఈ కథ కోసం ప్రత్యేకంగా తీసిన ఛాయా చిత్రమిది. ఫోటో: వై.ఎస్.ఎన్. మూర్తి

వాళ్ళింటికే పరిగెడుతుంటాడు తను. ఇటీవల ఆయనకి గుండెజబ్బు వచ్చింది. మొదటిసారి ఆయన ఖాయిలాపడ్డప్పుడు తను వెళ్ళ లేకపోయాడు ఈసారి తన కోసం బాబాయి కలవరిస్తున్నాడంటే వెళ్ళితీరాలి.

"ఎప్పుడు బయల్దేరుతున్నావ్?" అడిగాడు రఘునందనరావు.

"ఈ రోజే వెళ్తా నాన్నా. పాపం బాబాయికి ఎలావుందో ఏమిటో," అన్నాడు మోహన కృష్ణ.

రఘునందనరావు కొడుకు వంక ప్రశ్నంగా చూశాడు. "కోర్టు వ్యవహారాలతో తీరక నేను రాలేకపోయానని చెప్పు," అన్నాడు.

మోహనకృష్ణ ఆ సాయంకాలం బస్సుకే హైదరాబాదు బయల్దేరి వెళ్ళాడు.

అతను వెళ్ళేసరికి పినతండ్రి కులాసాగానే కనిపించాడు.

"బాబాయ్, నీకు ఒంట్లో కులాసాగా లేదని పిన్ని వుత్తరం రాసిందని చెప్పాడే నాన్న?" అన్నాడు మోహనకృష్ణ.

"ఆ ఆ, అవునోయ్. నాలుగు రోజుల క్రితం ఈ గుండెజబ్బు మళ్ళీ తిరగబెట్టినట్టనిపించింది. ఇప్పుడేం లేదులే- మందులు తింటున్నాగా," అన్నాడు పినతండ్రి.

"ఎలాగూ వచ్చావు. కనీసం పదిరోజులైనా వుండందే నిన్ను వెళ్ళనిచ్చేది లేదు," అందతని పిన్ని.

మోహనకృష్ణ వాళ్ళమాట ప్రకారమే పదిరోజులున్నాడక్కడ.

అతను మళ్ళీ తమ వూరికి తిరిగి వెళ్ళేసరికి తన అమ్మానాన్న మొహాల్లో ఏదో మార్పు కనిపించింది. తండ్రి మరింత గంభీరంగా కనిపిస్తే, తల్లి మరీ దిగులుగా కనిపించింది. పలకరించబోతే ఇద్దరూ తనతో సరిగ్గా మాట్లాడ లేకపోయారు. తల్లి మరీ తనతో మొహం చాటు చేసుకు తిరగడం అతనికి చాలా ఆశ్చర్యంగా అనిపించింది.

"ఏమైందమ్మా?" అంటూ తల్లిని అయిదారు సార్లు పరామర్శించబోయినా పద్మావతమ్మ నుంచి మౌనమే అతనికి సమాధానమైంది. అసలేం జరిగిందో తెలీక గిలగిలలాడి పోయాడు.

అతను వెళ్ళిన రోజు కల్యాణి రాలేదు. ఆ మర్నాడు కూడా రాలేదు. క్రమంగా అతన్లో అనుమానం ప్రారంభమైంది. ఏదో జరగరానిదే జరిగివుండాలని మనసు కీడు శంకించనారంభించింది.

### నీతోకాదు

"గాడిదను వెంటబెట్టుకొని ఊరంతా తిరుగుతున్నావ్... సిగ్గు లేదూ...?" అన్నాడు గోవింద రాజు.

"కళ్ళు కనిపించడం లేదా. ఇది గాడిద కాదు. మేక..." అన్నాడు అప్పల్రాజు.

"నేను మాట్లాడింది నీతో కాదు మేకతో..."

— గుత్తుల శ్రీనివాసరావు.

"అమ్మా! అసలేం జరిగింది? కల్యాణి మనింటికి ఎందుకు రావడం లేదు?" తల్లి దగ్గరికి మళ్ళీ వెళ్ళి ఆక్రోశిస్తున్నట్టుగా అడిగాడు.

కల్యాణి పేరు వింటూనే పద్మావతమ్మలో కలవరపాటు కనిపించింది. "ఏమో నాకేం తెలుసు? అయినా నీ ప్రశ్నలకు సమాధానం చెప్పకుంటూ కూర్చోవడమేనా నా పని? వెళ్ళు వెళ్ళు," అంది తడబడుతూ.

"మీరేదో నానుంచి దాస్తున్నారు," చివరికి తెగేసి అనేశాడు మోహనకృష్ణ.

"ఇందులో దాచడానికేం లేదు," వెనక నుంచి తండ్రి కంఠస్వరం కఠినంగా వినిపించింది.

మోహనకృష్ణ గిరుక్కున వెనక్కి తిరిగాడు.

"వాళ్ళీ వూర్నించి వెళ్ళిపోయారు," అంత కంటే కఠినంగా అన్నాడు రఘునందనరావు.

"వెళ్ళిపోయారా!" మోహనకృష్ణ ఒక్క సారిగా స్తంభించిపోయాడు. అతనికి తల గిర్రున తిరిగిపోతున్నట్టనిపించింది. కొద్ది క్షణాల తర్వాత తేరుకుని, "మోసం!" అనరిచాడు.

రఘునందనరావు చరచరా అక్కణ్నించి వెళ్ళిపోతున్నాడు.

"నాన్నా! కల్యాణీ వాళ్ళు వెళ్ళలేదు. మీరే పంపేశారు. నా మూలంగా మీరే వాళ్ళని వూర్నించి తరిమేశారు," ఆక్రోశించాడు మోహన కృష్ణ.

రఘునందనరావు అప్పటికే తన ఆఫీసు గదిలోకి వెళ్ళిపోయాడు.

మోహనకృష్ణలో ఒక్కసారిగా ఆవేశం పెల్లుబికింది. ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఇంట్లోంచి బయటికి పరిగెత్తాడు.

"మోహనా!" అనరుస్తూ గుమ్మంలోకొచ్చి పడింది తల్లి. అప్పటికే అతను వీధి మలుపు తిరిగేశాడు.

"ఏమండీ! వాడు వెళ్ళిపోతున్నాడు. ఆపండి," ఆక్రోశించింది పద్మావతమ్మ.

"ఎక్కడికీ వెళ్ళడు. వాడే తిరిగి వస్తాడు," తన గదిలోంచి సమాధానమిచ్చాడు రఘునందన రావు.

అయితే మోహనకృష్ణ ఇంటికి తిరిగి రాలేదు. కల్యాణి ఎక్కడికి వెళ్ళిందో ఎంత ప్రయత్నించినా అతనికి జాడదొరకలేదు. వూళ్ళో అతనికి తెలిసిందేమంటే కల్యాణీ ఆమె తల్లీ రాత్రికిరాత్రి ఆ వూరు వదిలిపెట్టి వెళ్ళిపోయారని.

అది జరిగాక మోహనకృష్ణ గుంటూరు బస్సు ఎక్కుతుండడం తెలిసినవాళ్ళు కొందరు చూశారు. ఆ తర్వాత అతని జాడ తెలియకుండా పోయింది.

ఒకరోజు, రెండు రోజులు, మూడు రోజులు- పదిరోజులు గడిచిపోయాయి. మోహనకృష్ణ ఇంటికి తిరిగిరాలేదు.

పద్మావతమ్మ దిగుల్తో మంచమెక్కింది. "మీరే ఇదంతా చేశారు. పనిపిల్ల కూతుర్ని పెళ్ళి చేసుకుంటానన్నాడని వాళ్ళని వూళ్ళోంచి తరిమేశారు. ఒక్కగానొక్క కొడుకుని నాకు లేకుండా చేశారు. వాడు రాడు. నాకు తెలుసు. వాడెన్నటికీ మనల్ని క్షమించడు," అంటూ కుమిలి కుమిలి ఏడుస్తుంది.

రఘునందనరావు ఒక్క మాట కూడా మాట్లాడడు. రాతిబండలా మౌనంగా వుండి పోతాడు. ఆయన మనసులో ఏముందో ఎవరికీ తెలీదు.

రెండు నెలలు గడిచాయి.

"వాడి కోసం పేపర్లో ప్రకటన ఇవ్వండి," కన్నీళ్ళతో వేడుకుంది పద్మావతమ్మ.

రఘునందనరావు ఆ మాటకు ఖస్సు మన్నాడు. "ఇచ్చి? ఫలానా లాయర్ రఘు నందనరావు కొడుకు ఎవతెనో ప్రేమించి ఇల్లొదిలి లేచిపోయాడని చాటింపు వేయించాలా? ఎంత అప్రతిష్ఠ! నా వల్ల కాదు," అనేశాడు.

మరో రెండు నెలలు గడిచాయి.

పద్మావతమ్మ పరిస్థితి విషమించింది. ఆవిడది మనోవ్యాధి. ఎన్నటికీ తీరేది కాదు. హఠాత్తుగా మంచం మీంచి లేచి హిస్టీరియాతో గోడకేసి తలబాదుకుంటుంది. అంతలోకే ఫిట్సు వచ్చిందానిలా విరుచుకు పడిపోతుంది. మెలకువగా వున్నా నిద్రపోతున్నా అన్ని వేళలా మోహనా మోహనా అంటూ కులవరిస్తుంది. దాంతో చివరికి పేపర్లో ప్రకటన ఇవ్వక తప్పిందికాదు రఘునందనరావుకి- "బాబూ, మోహనకృష్ణ! నువ్వు ఇల్లు వదిలి వెళ్ళి

నప్పటినుంచి మా అమ్మ మనోవ్యాధితో మంచం పట్టింది. నకాలంలో నువ్వు తిరిగిరాక పోతే చివరి చూపులు కూడా దక్కించుకోలేవు, ఇట్లు, నీ తండ్రి రఘునందనరావు.

ఆ ప్రకటన ఇచ్చిన వారం రోజుల తర్వాత ఒకనాటి అవరాహ్నవేళ ఇంటికి తిరిగి వచ్చాడు మోహానకృష్ణ గడ్డం పెరిగింది. వళ్ళంతా మట్టిగొట్టుకుపోయింది. కళ్ళు అరంగుళం లోతుకు వెళ్ళాయి. చివరికి అతని తండ్రి కూడా అతన్ని గుర్తుపట్టలేని పరిస్థితిలో వున్నాడు.

ఇంట్లోకి వస్తూనే అతను నేరుగా తల్లి గదిలోకి వెళ్ళిపోయాడు. ఆ నమయంలో పద్మావతమ్మ మంచం మీద జీవచ్ఛవంలా పడుంది. రఘునందనరావు ఆ వక్కనే కూర్చొని వున్నాడు. మోహానకృష్ణ చరచరా వెళ్ళి తల్లి వక్కన కూర్చుంటూ, "అమ్మా, కళ్ళు తెరువమ్మా! నేనొచ్చేశాను," అన్నాడు.

కొడుకు గొంతు వింటూనే పద్మావతమ్మ అప్పుడే ప్రాణం వచ్చిందానిలా కళ్ళు తెరిచింది. కొద్ది క్షణాలు తన ఎదురుగా కూర్చున్న మనిషిని గుర్తువట్టలేకపోతున్నట్టు తదేకంగా చూసింది. అంతలోనే బావురుమంటూ లేచి కూర్చుండిపోయి అతన్ని కావలించుకుంది. తల్లీ కొడుకులు చాలా సేపటివరకూ ఒకర్నొకరు వట్టుకుని ఏడుస్తుండిపోయారు.

అది మొదలు పద్మావతమ్మ కొడుకు విషయంలో మరీ పసిపిల్ల అయిపోయింది. అతను తిరిగొచ్చాక ఆవిడ కోలుకున్న మాట నిజమే. అయితే అతను ఇల్లొదిలి వెళ్ళిననాటి షాక్ నుంచి తేరుకోలేకపోయింది. తనకెంతో ఇష్టమైన బొమ్మని ఎవరైనా లాక్కుపోతుంటే ఒక పసిపిల్ల ఎలా ప్రవర్తిస్తుందో కొడుకు విషయంలో అలా ప్రవర్తించసాగింది. ముఖ్యంగా భర్తని బద్ధశత్రువులా చూడ్డం మొదలెట్టింది. తన కొడుకుని తన నుంచి విడదీయడానికే అవతరించిన క్షుద్రశక్తి భర్తే నన్నట్టుగా వ్యవహారించనారంభించింది. ఆ విషయంలో మాత్రం రఘునందనరావు పూర్తిగా అశక్తుడై పోయాడు. మోహానకృష్ణ తనకూ కొడుకేనన్న విషయం ఆ తల్లి మనసులో నాటడంలో పూర్తిగా విఫలుడైపోయాడు. ఫలితంగా తనింట్లో తానే ఆయన ఒంటరివాడైపోవలసి వచ్చింది. ఆయన ఆరోగ్యం మీద అది విషమ ప్రభావం చూపించింది. అదే గుండెజబ్బు రూపంలో ఆయన్ని కబళించింది.

ఒకరోజు కోర్టులో కేసు వాదిస్తుండగా తీవ్రమైన గుండెపోటు వచ్చి ఆయన అక్కడే పడిపోయాడు. ఆసుపత్రికి తీసుకెళ్ళేలోగానే ఆయన ప్రాణం పోయింది.

> **బెండకాయ**
>
> "మీదేం కూర వదినగారూ? ఆసక్తిగా అడిగింది శారద.
>
> "బెండకాయ వేపుడు. ఏం... అలా అడిగారు?" యధాలాపంగా ప్రశ్నించింది సుమిత్ర.
>
> "ఆ! రాత్రి మా పెరట్లో బెండకాయలు ఏ దొంగ వెధవలో కోసుకుపోయారు."
>
> — డా: ఆర్. విజయకుమార్

భర్త చనిపోయాక పద్మావతమ్మ రెండేళ్ల మాత్రం జీవించింది. ఆ తర్వాత ఆవిడా పోయింది. ఒకప్పుడు నవ్వులు పువ్వులు విరిసిన ఆ ఇంట్లో ఇప్పుడు స్మశానంలోని నిశ్శబ్దం ఆవరించుకుంది. ఆ నిశ్శబ్దంలో మోహానకృష్ణ ఒక్కడే ఒంటరిగా మిగిలాడు.

తల్లీ తండ్రీ పోయాక అతని మానసిక పరిస్థితి విచిత్రంగా మారింది. ఈ సర్వనాశనానికంతా తనే కారణం అనే ఆత్మవ్యధ అతన్ని బాగా కుంగదీసింది. హిమాలయాలకు వెళ్ళి తవస్సు చేసి దేవుడ్ని ప్రత్యక్షం చేసుకుని ఇలా ఎందుకు చేశావని అడగాలని ఒకసారి అనుకుంటాడు. అసలు దేవుడనేవాడు లేడనే నాస్తికవాదంలో ఇంకోసారి పూర్తిగా మునిగిపోతాడు. తనేదో గొప్ప అన్వేషణ సాగించడానికే పుట్టాడని ఒకసారి భావించుకుంటాడు. అసలు తన జన్మకు అర్థమే లేదని ఇంకోసారి వూహించుకుంటాడు. అతనికి మనశ్శాంతి పూర్తిగా లోపించింది. చివరికా వూళ్ళో వుండనే లేక పోయాడు.

తండ్రి సంపాయించిన పొలమూ పుట్రా వగైరా ఆస్తిపాస్తులన్నీ తెగనమ్మేసి ధనరూపంలోకి మార్చుకున్నాడు. తను పుట్టిపెరిగిన ఇంటిని మాత్రం అమ్మలేకపోయాడు. ఒకరోజు ఆ ఇంటికి పెద్ద తాళం వేసి ఎవరికీ చెప్పకుండా రాత్రికిరాత్రి రైలెక్కేశాడు.

ఆ తర్వాత మొహానకృష్ణ ఏమైపోయాడో ఎవరికీ తెలీదు.

అతను వెళ్ళిపోయాక చాలా రోజుల వరకూ ఆ వూరివాళ్లు ఆ కుటుంబగాథని రకరకాలుగా చెప్పుకునేవారు. ఆ కుటుంబానికెదురైన పర్యవసానానికి గల కారణాన్ని ఎవరికి తోచినట్టు వాళ్లు అన్వయించుకునేవాళ్ళు. కొందరా ఇంటికి గ్రహదోషం పట్టిందంటే కొందరా ఇంటికి పిశాచం ఆవహించిందని వివరించారు. కాలం గడిచే కొద్దీ ఆ వూళ్ళో ఆ కుటుంబం గురించి చెప్పుకోవడం ఆగిపోయింది.

కాలచక్రంలో నలభై ఏళ్ళు తిరిగిపోయాయి.

ఒకరోజు-

హైదరాబాదు నుంచి వచ్చిన రైల్లోంచి ఒక ముసలివాడు ఆ వూళ్ళో దిగాడు. చూడ్డానికెంతో సాత్వికుడిలా వున్నాడతను. అతని రూపం ఎవరికైనా గౌరవం కలిగించేదిగా వుంది. సాధారణమైన లాల్చీ పైజామా ధరించాడు. భుజానికో సంచి మాత్రం వేలాడుతోంది.

స్టేషన్లోంచి బయటికొస్తూనే అతనో రిక్షా పిలిచాడు.

"ప్లీడరు రఘునందనరావు గారింటికి వెళ్ళాలి."

"ప్లీడరు రఘునందనరావా!" అంటూ రిక్షా అతను తల గోక్కున్నాడు.

అప్పుడు గుర్తొచ్చిందతనికి ఈతరం వాళ్ళకి రఘునందనరావుగారు ఎవరో తెలిసి వుండకపోవచ్చని. వీధి పేరుతో పాటు ఆ ఇంటి గుర్తులు చెప్పాడతను.

"ఓ! భూత్‌బంగ్లానా అండీ?" అన్నాడు రిక్షావాలా. "కూకోండి, దిగబెడతాను."

"ఓహో! ఇప్పుడా ఇంటిని భూత్‌బంగ్లా అంటున్నారా!"

"ఎప్పుడో ఆ ఇంట్లో ఎవరో చచ్చిపోయారంటండి. అప్పట్నేంచీ ఆ ఇల్లు పాడుబడిపోయింది గదండీ."

"ఆ ఇంటికి పట్టిన దెయ్యం పేరేమిటో నీకు తెల్సా?" అడిగాడు.

"తెల్దండీ," రిక్షా తొక్కుతూ అన్నాడు రిక్షావాలా.

"మోహానకృష్ణ" అంటూ మౌనం వహించాడతను.

రఘునందనరావు గారింటి ముందు రిక్షా ఆగింది.

ఆ ఇంటివైపు చూసిన అతనికి అప్రయత్నంగా కన్నీళ్ళు తిరిగాయి. అదే ఇల్లు! ఇంకా వడిపోకుండా నిలబడే వుంది. గోడలమీద సున్నం మాయమైపోయింది. ఎండకూ వానకూ గోడలు నల్లబారాయి. ఆ ఇంటి ఇనవ గేటు చెక్కు చెదరకుండా అలాగే వుంది. అతనా గేటు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు. ఒకనాడు ఆ ఇల్లనుభవించిన వైభవం గుర్తుకొచ్చి అతని గుండె బరువెక్కింది. తల్లీ తండ్రీ అంతా గుర్తుకొచ్చారు. ముఖ్యంగా తల్లి ప్రేమ గుర్తుకొచ్చి

నిలబడలేక అరుగుమీద కూలబడి కళ్ళు మూసుకున్నాడు.

"ఎవరూ?"

అతనొక్కసారిగా వులిక్కిపడి కళ్ళు తెరిచాడు.

ఎదురుగా ఒక వ్యక్తి నిలబడి వుంది. యాభై అయిదేళ్ళకు పైబడే వుంటుందామె వయసు.

"ఎవరూ?" అతనెవరో గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తూ మళ్ళీ అందామె.

అతనోసారి ఆమె వైపు తదేకంగా చూశాడు.

ఉన్నట్టుండి అతని గుండె ఝల్లుమంది.

"కల్యాణీ!" అంటూ దిగ్గున లేచి నిలబడ్డాడు.

ఆమె అతనివైపు అవాక్కుగా చూసింది.

"నువ్విక్కడున్నావా కల్యాణీ!" ఆమె భుజాలు పట్టుకుని వూపేస్తూ ఆవేశంగా అన్నాడతను. "నీ కోసం ఎక్కడెక్కడో వెతికాను. చివరికి నువ్విక్కడున్నావా కల్యాణీ!"

అప్పటికీ ఆమె అతనెవరో అర్థంకానట్టుగానే చూసింది.

"నేను-నేను కల్యాణీ! గుర్తు పట్టలేదా?"

అతని గుండెలోతుల్లోంచి ఆనాటి కవిత అప్రయత్నంగా బయటికొచ్చింది-

"నీవు పూవువైన నాడు
నీకు తావినైన చాలు,
నీవు జీవితానివి
నీవు నాకు వున్న చాలు."

వేదనాపూరితమైన ఆమె కళ్ళలో క్రమంగా ఒక వెలుతురు పొడసూపింది.

ఆమె గొంతు నెమ్మదిగా వణికింది-

"కనుల కాంతి వీడెను
కలలు మిగిలిపోయెను,
నీదు రాకకెదురు చూచి
బ్రతుకు గడిచిపోయెను.

నేను దీపమైన నాడు
నీవు కాంతివైన చాలు,
నీవు జీవితానివి
నీవు నాకు వున్న చాలు."

అతని శేషకవిత ఆనాడు
పూర్తయింది.


# ఆదివారం

**రాజకీయ వారపత్రిక**



- రాజకీయ వారపత్రికా రంగంలో సంచలనం.
- పరిశోధనాత్మక జర్నలిజంలో అగ్రతాంబూలం.
- సమకాలీన రాజకీయాలపై సమగ్ర విశ్లేషణ.
- నాటి నేటి నాయకులు, మేధావులు మెచ్చిన ఏకైక సంచలనాత్మక రాజకీయ వారపత్రిక

ఆంధ్ర రాష్ట్రమంతటా విస్తరించి; అందరినోటా ప్రశంసలనందుకుంటున్న, అత్యధిక సర్క్యులేషన్ గల ఏకైక రాజకీయ వారపత్రిక "ఆదివారం"

ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ రంగాలలో జరుగుతున్న పెను మార్పులను ఎప్పటికప్పుడు దర్పణంలా మీ ముందుంచుతున్నది "ఆదివారం"

ఏ రాజకీయ పక్షానికి గొడుగు పట్టకుండా, మరేపక్షంపై బురద చల్లకుండా నిష్పక్షపాతమైన రాజకీయ వ్యాసాలను అందిస్తున్నది "ఆదివారం"




జనవరి 24–30
సంచికలో చదవండి

★ దేశంలో మధ్యంతర ఎన్నికలు
★ ఇరకాటంలో 'కోట్ల'
★ మతరక్కసి కోరల్లో మహానగరం
★ రెండిళ్ళ పూజారి... ఎన్.టి.ఆర్.
★ తెలుగురోషం— పొలిటికల్ సెటైర్
★ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఎర్ర త్రికోణం

చదవండి చదివించండి